క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



తాళ్లూరు శివారులో డివైడర్ మధ్యలో బోల్తాపడ్డ ట్రాక్టర్

గండేపల్లి: జాతీయ రహదారిపై మండలంలోని తాళ్లూరు శివారులో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. జగ్గంపేట నుంచి ఉప్పలపాడు వెళుతున్న ట్రాక్టర్ మండలంలోని తాళ్లూరు శివారులో రోడ్డు దాటుతుండగా వెనకే వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. కాగా ట్రాక్టర్‌కు బోర్డు వేసే పొడవాటి పైపు ఉండగా చీకటిలో లారీ డ్రైవర్ పైపును గమనించని కారణంగా ప్రమాదం జరిగింది.

అదృశ్యమైన వివాహిత తల్లి చెంతకు..

గండేపల్లి: అదృశ్యమైన వివాహితను గుర్తించి ఆమె తల్లికి అప్పగించినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని మల్లేపల్లికి చెందిన వివాహిత భర్త దగ్గరకి వెళ్లేందుకు ఇష్టం లేకపోవడంతో జూన్ 4న తన రెండేళ్ల బాబుతో అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై యువి శివ నాగబాబు, సిబ్బందితో సాంకేతిక పరిజ్ఞానంతో నెల్లూరు జిల్లా గూడురులో ఉన్నట్టుగా ఆమెను గుర్తించారు. ఆమెను తీసుకువచ్చి తల్లికి అప్పగించినట్టు సీఐ తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ ముందంజ



ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిని ప్రకటిస్తున్న మాజీ లయన్స్ గవర్నర్ రాఘవేంద్రరావు

ప్రత్తిపాడు: సేవా కార్యక్రమాలు అమలు చేయడంలో ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ ముందంజలో ఉందని మాజీ లయన్స్ గవర్నర్ డి.రాఘవేంద్రరావు కొనియాడారు. స్థానిక లయన్స్ కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం రాత్రి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. ప్రస్తుత లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇంజనీర్ మోహన్ అధ్యక్షతన జరిగిన సభలో నూతన లయన్స్ క్లబ్ సభ్యులతో రాఘవేంద్రరావు ప్రమాణం చేయించారు. మాజీ లయన్స్ గవర్నర్ బీవీఎస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జోన్ చైర్‌పర్సన్ కేఆర్‌వీవీ రమణ, లయన్స్ ప్రతినిధులు డీవీఎస్ రమేష్‌రాజు, గుడాల వెంకటరత్నం, ఇందన ఏసుబాబు, డీవీఎస్ సుబ్బరాజు (గోపీరాజు) తదితరులు పాల్గొన్నారు.

క్లబ్ నూతన అధ్యక్షుడిగా రెడ్డినాయుడు

ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఏడిద రెడ్డినాయుడు ఎంపికయ్యారు. కార్యదర్శిగా గోళ్ల నాగేశ్వరరావు, కోశాధికారిగా గుడాల రాజబాబు, ఉపాధ్యక్షులుగా ఐ.ఏసుబాబు, సోమకిరణ్, చీఫ్ అడ్మినిస్ట్రేషన్‌గా డీవీఎస్ రాజు, డైరెక్టర్లుగా పంతం కృష్ణ, డి.ఫకీర్‌రాజు, అప్పారావుతో పాటు మరో పది మంది సభ్యులుగా ఎంపికయ్యారు.

కిర్లంపూడి సొసైటీ చైర్మన్‌గా చినబాబు

కిర్లంపూడి: కిర్లంపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) చైర్మన్‌గా కుర్ల వెంకట రమణమూర్తి (చినబాబు) ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు సొసైటీ మెంబర్లుగా గండే రాయుడు, పాతంశెట్టి వెంకటలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. చదరం చంటిబాబు, తూము కుమార్, గుడాల రాంబాబు, గండే చినకాశీ, సొసైటీ సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలిపారు.

చాకిరేవులపాలెంలో తొలి అడుగు

రౌతులపూడి: మండలంలోని జల్దాం శివారు చాకిరేవులపాలెంలో ఆదివారం తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పార్టీశ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ఆరా తీశారు. గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. రూ.13 లక్షలతో ఏర్పాటు చేసిన కుళాయిలను ఆమె ప్రారంభించారు. ములగపూడి సర్పంచ్ తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

20న యంగ్ మైండ్ వార్షికోత్సవం

బాలాజీచెరువు: ఈ నెల 20న స్థానిక దంటు కళా క్షేత్రంలో యంగ్ మైండ్ స్వచ్ఛంద సంస్థ ప్రథమ వార్షికోత్సవం నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షుడు వాకడ వెంకటరమణ (చిన్న) ఆదివారం తెలిపారు. ఆ రోజు దేశ సైనికులు, అన్నదాతలు, నర్సులు, పారిశుద్ధ్య కార్మికులు, అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, సమాజ సేవకులు, కళాకారులు, జర్నలిస్టులు, ఆదర్శ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- హెల్మెట్ లేని ప్రయాణం.. యమలోకానికి పయనం
- కళ్ల ఎదుటే ప్రమాదాలు జరుగుతున్నా నిబంధనలు పాటించని వాహనదారులు
- యువతకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- మండలంలోని రోడ్డు ప్రమాదాల్లో 50 మందికి పైగా మృత్యువాత



హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

కిర్లంపూడి: యువత నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారు. మితిమీరిన వేగంతో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవడమే కాకుండా ఇతరులను సైతం ప్రమాదంలోకి నెట్టిస్తున్నారు. శక్తి వంచనలేకుండా పోలీసులు పలు రకాలుగా అవగాహన కలిగిస్తున్నా కొందరిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడుపుతున్న వారి వాహనాలు సీజ్ చేయడం, జరిమానా విధించినా మార్పు రావడం లేదు. రహదారి వారోత్సవాల్లో భాగంగా ఇటీవల పోలీసులు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పిస్తుంచారు. కొందరు మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారు. ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులు కావడంతో పాటు మృత్యువు ఒడికి చేరి ఆయా కుటుంబాలకు తీరని విషాదం మిగుల్చుతున్నారు.

మండల పరిధిలో 2017 నుంచి..

మండల పరిధిలో 2017 నుంచి 2024 వరకు బైక్ ప్రమాదాల్లో 50 మందికి పైగా మరణించగా సుమారు 60 మందికిపైగా ఆసుపత్రుల పాలయ్యారు. రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించకుండా వాహనాలు నడిపిన సుమారు 40 మందిపై కేసులు నమోదయ్యాయి.



ప్రమాదాల నివారణపై యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సతీష్

తల్లిదండ్రులు బాధ్యత వహించాలి



తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు. 18 సంవత్సరాలు నిండి డ్రైవింగ్ లైసెన్స్ పొందినప్పుడే వాహనాలు పిల్లలకు ఇవ్వాలి. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలి. నిబంధనలు విరుద్ధంగా సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– జి.సతీష్, కిర్లంపూడి ఎస్సై

పోలీసుల కంటపడకుండా..

డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు ఏ విధమైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ప్రయాణిస్తున్నారు. పోలీసులు, ఆర్టీఏ అధికారులకు చిక్కకుండా తప్పించుకోవాలనే ఉద్దేశంతో వేగంతో పాటు ఇరుకుమార్గాలు, దొడ్డు దారుల గుండా వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు.

అవగాహన కల్పించినా..

గంట సమయం లేటయినా పర్లేదు సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలంటూ జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్సైలు, పోలీసులు వాహనదారులను మొత్తుకుంటున్నారు. హెల్మెట్ ధరించని, నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధిస్తున్నారు. యువతలో మార్పు తీసుకురావాలని అనేక రాకాలుగా వినూత్న కార్యక్రమాలు, అవగాహన ర్యాలీలు చేపడుతున్నారు. అయినా యువత మాత్రం ఆ విషయాన్ని పెడచెవిన పెట్టి ఒకే బైక్‌పై ముగ్గురు వీలైతే నలుగురు ఎక్కి అతివేగంగా ప్రయాణించి ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు.

ప్రమాదాలు ఇలా...

- ఇటీవల ముక్కొల్లు గ్రామం నుంచి కుటుంబ సమేతంగా మోటర్ సైకిల్‌పై కిర్లంపూడి సినిమాకు వస్తుండగా స్థానిక సత్యదేవా కల్యాణ మండపం వద్ద ఎదురుగా వెళ్తున్న రిక్షాను ఢీకొని అదుపుతప్పి ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ టైర్ కింద పడి పోవడంతో బైకిస్ట్ అక్కడికక్కడే మరణించాడు.
- కిర్లంపూడికి చెందిన ఇద్దరు యువకులు రాజుపాలెం నుంచి కిర్లంపూడి వస్తుండగా ఎదురుగా వస్తున్న లోడు ఆటోను ఢీకొట్టడంతో ఇద్దరూ మృతిచెందారు.
- పెళ్లి చూపులకు అని సామర్లకోట నుంచి కిర్లంపూడి వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఆటో ఢీకొనడంతో తీవ్రగాయాల పాలైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు.
- భీమవరం నుంచి అన్నవరం ఒకే బైక్‌పై వెళుతున్న ముగ్గురు యువకులు కృష్ణవరం టోల్‌గేట్ సమీపంలో ఎదురుగా వెళ్తున్న ట్రక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు చికిత్స పొందుతూ మరణించారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.
- కిర్లంపూడి నుంచి సామర్లకోట వైపు వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వేగంగా బైక్‌పై వచ్చిన యువకుడు ఢీకొట్టిన ఘటన రాజుపాలెం వ్యవసాయశాఖ చెక్‌పోస్ట్ వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి.
- కొత్త సింహాద్రిపురం గ్రామ సమీపంలో మెకానిక్‌గా పనిచేస్తున్న యువకుడు బైక్ సామాన్లు తీసుకురావడానికి తన స్నేహితుడితో కలిసి ప్రత్తిపాడు వెళుతుండగా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడు చికిత్స పొందుతూ మరణించాడు.
- ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో కాళ్లు, చేతులు, వెన్నెముక విరిగిపోయి దీర్ఘకాలంగా మంచానికే పరిమితమై నరకయాతన అనుభవిస్తున్నారు. ఇలా అనేక మంది ప్రమాదాల బారిన పడి నిర్జీవంగా మంచంపై పడి ఉండడంతో వీరిపై ఆధారపడి ఉన్న కుటుంబాల బాధలు వర్ణనాతీతం.

తోటను కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు



వీరవరంలో తోట నరసింహాన్ని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట నరసింహాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట టౌన్ ఉపాధ్యక్షుడిగా భూమాడ గణపతి, జగ్గంపేట మండల ప్రధాన కార్యదర్శిగా సప్ప రఘునాథ్, గోకవరం మండలం జనరల్ సెక్రటరీగా సేనాపతి త్రిమూర్తులు నియమితులయ్యారు. కాగా ఆదివారం వీరవరంలోని తోట నరసింహం నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.చంద్రరావు ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో గ్రామాల్లో అభివృద్ధి పనులపై చర్చిస్తారన్నారు. అధికారులు పూర్తి వివరాలతో హాజరు కావాలని కోరారు.

నేడు భూముల కౌలు వేలం

తొండంగి: పిఠాపురం శ్రీసంస్థానికి చెందిన తొండంగిలోని శ్రీసత్రం భూములకు సోమవారం కౌలువేలం నిర్వహించనున్నారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఇప్పటికే పలుమార్లు వేలం వాయిదా వేసుకుంటూ వచ్చారు. ఎట్టకేలకు సోమవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రామంలో శివాలయం వద్ద వేలం నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



విలేకరులతో మాట్లాడుతున్న ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేలా నాయకులంతా కలసికట్టుగా పని చేయాలన్నారు. ప్రజల పక్షాన నిలబడి ఇంటింటికీ చంద్రబాబు మోసాలను వివరించడమే ధ్యేయంగా ముందుకు సాగుదామన్నారు. ‘బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ’ కార్యక్రమాన్ని ఇంటింటికీ తీసుకువెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. మండలంలోని పెదశంకర్లపూడిలో దోశ చిట్టిబాబు స్వగృహంలో ఆదివారం ముద్రగడ గిరిబాబు విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల హామీల మోసాలపై క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజాభిప్రాయాలు సేకరిస్తామన్నారు. ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం గంగలో కలిపేసిందని ఎద్దేవా చేశారు. తల్లికి వందనం ఇస్తామంటూనే కొర్రిలతో మోసం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తామని నమ్మించి, ఓట్లు వేయించుకున్న చంద్రబాబు చివరికి మానిఫెస్టోలో పెట్టిన హామీలనే అమలు చేయలేని దుస్థితికి వచ్చారని విమర్శించారు. పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవింద్, చినశంకర్లపూడి సర్పంచ్ ఏపూరి రామారావు, పార్టీ నాయకులు గుడాల వెంకటరత్నం, జువ్విన వీర్రాజు, దోశ నల్లబాబు, శేరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం

జగ్గంపేట: స్థానిక బాలాజీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్ సీపీ మండల విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా తెలిపారు. మాజీ మంత్రి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వ పాలన, వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దొంగ హామీలు, మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. సమావేశానికి పార్టీ శ్రేణులు తప్పకుండా హాజరు కావాలని గణేష్‌రాజా పిలుపు నిచ్చారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



పంచామృత కలశాలకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి ఆదివారం వైభవంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారి తిరునక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని 108 కలశాల పంచామృతాలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారికి అభిషేకించారు. పరివార దేవతలకు అభిషేకాలు చేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ఏలేశ్వరంలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

- మండిపోతున్న ఎండలు
- నిర్మానుష్యంగా మారిన రహదారులు

ఏలేశ్వరం: కాలం మారిపోతోంది. ఎండలు మండిపోతున్నాయి. వర్షాకాలంలోనూ వరుణుడి జాడ కానరాకపోవటంతో ప్రచండ భానుడు విలయతాండవం చేస్తున్నాడు. రోజురోజుకూ సూర్యభగవానుడు నిప్పులు చెరుగుతుండటంతో ఎండ తాపానికి తట్టుకోలేక గ్రామాల్లోని ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఆదివారం 33 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా 42 డిగ్రీల తీవ్రత చూపించింది. ఎండకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా రోడ్లపై జనసంచారం తగ్గింది. జాతీయ రహదారిపై మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం వరకూ వాహనాల రాకపోకలు తగ్గాయి. ఏలేశ్వరం పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే నర్సీపట్నం రోడ్, హనుమాన్ జంక్షన్, లింగంపర్తి రోడ్డు జనసంచారం లేక వెలవెలబోయాయి. ఎండ వేడిమి భరించలేక వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాలు పడే జూలై నెలలో ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

తారెత్తించిన ఎండ

తొండంగి: తొలకరి ప్రారంభమైనప్పటికే వేసవి తీవ్రత తగ్గడం లేదు. కొద్ది రోజులుగా వేసవిని తలపించేలా పగటి ఉష్ణోగ్రతలు నమోదవ్వడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఆదివారం ఉదయం నుంచే ఎండ తీవ్రతతో పాటు వేడి గాలుల కారణంగా ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. రహదారులన్నీ జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. మరికొద్ది రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని వాతావరణశాఖ ప్రకటించింది. కాగా కొద్ది రోజుల క్రితం అడపాదడపా కురిసిన వర్షాలకు మెట్టలో రైతులు వరి నార్లు పోశారు. ప్రస్తుత ఎండలకు వరినారు ఎండిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తాండవలో ఆశాజనకంగా నీటి నిల్వలు



నీటితో కళకళలాడుతున్న తాండవ జలాశయం

కోటనందూరు: తాండవ జలాశయంలో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. గతేదాది చివరిలో కురిసిన వర్షాలతో పాటు ఈ ఏడాది మే, జూన్ నెలల్లో కురిసిన వర్షాలకు జలాశయంలో క్రమంగా నీటిమట్టం పెరిగి ప్రస్తుతం 368.2 అడుగులకు చేరింది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా 370 అడుగులకు నీటిమట్టం చేరితే నీటి విడుదలకు అనుకూలం. జూలై నెల ప్రారంభంలో విస్తారంగా కురిసిన వర్షాలకు తాండవ జలాశయ ఆయకట్టు పరిధిలో రైతులు నారుమడులు వేశారు. గత 10 రోజులుగా వర్షం ముఖం చాటేయడం, వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలకు నారుమళ్లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మరో నాలుగైదు రోజులు కొనసాగితే నారుమళ్లు దెబ్బతిని ఖరీఫ్ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందని రైతులు చెబుతున్నారు. కోటనందూరు మండలంలో సుమారుగా 10 వేల ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. నారుమడుల అవసరాలకు అనుగుణంగా తాండవనీటిని విడుదల చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



కిర్లంపూడిలో 47 ఏళ్ల తరువాత కలసిన పూర్వ విద్యార్థులు

కిర్లంపూడి: అరే బాగున్నావా... ఎంత మారిపోయావురా.. ఎంత కాలమైంది నిన్ను చూసి.. అంటూ కుశల ప్రశ్నల మధ్య పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సాగింది. స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన 1977–1978 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా పూర్వ విద్యార్థులు డీవీఎస్ మూర్తి, పి.శ్రీను, పి.రమేష్, ఆర్.చిన్న, కె.వెంకటేశ్వరరావు చొరవతో సుమారు 47 ఏళ్ల తరువాత కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. అనంతరం తాము చదువుకున్న తరగతి గదులకు వెళ్లి అలనాటి చిలిపి చేష్టలు గుర్తు చేసుకుని మురిసిపోయారు. మిత్రులంతా కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అలనాటి స్నేహితులతో కలిసి గ్రూపు ఫొటోలు దిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

వైభవంగా అమ్మవార్ల జాతర



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీపీ



పెదశంకర్లపూడిలో ఏగులమ్మతల్లిని దర్శించుకుంటున్న ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో ఏగులమ్మతల్లి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారిని శిరస్సున దాల్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముద్రగడ వెంట పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ నాయకులు దోశ చిట్టిబాబు, మాజీ సర్పంచ్ దోశ తమ్మారావు (నల్లబాబు), గుడాల వెంకటరత్నం, శేరు కృష్ణ, గోళ్ళ జయశేఖర్ తదితరులున్నారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారు

తుని రూరల్: ఎస్.అన్నవరం శివారు వేంపాడ చెరువు వద్ద కొలువైన నల్లగొండమ్మతల్లి ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు అమ్మవారికి కూరగాయలు, పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆషాఢమాసంలో మూడో ఆదివారం కావడంతో గ్రామస్తులు చీర, సారెతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శాకంబరి అలంకరణలో నల్లగొండమ్మతల్లి

ఘనంగా పరదేశమ్మ జాతర

శంఖవరం: గ్రామంలో వేంచేసిన పరదేశమ్మ అమ్మవారి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, రంగులతో సుందరంగా అలంకరించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భజన బృందాల సభ్యులు భజనలు చేశారు. ఎంపీపీ పర్వత రాజుబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సేవాభావం పెంపొందించుకోవాలి

- వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు మురళీకృష్ణంరాజు



ధర్మవరంలో మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: ప్రతిఒక్కరూ సామాజిక సేవాభావాన్ని పెంపొందించుకోవాలని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. మండలంలోని ధర్మవరంలో శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్ట్ నిర్వాహకుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మురళీకృష్ణంరాజు ప్రారంభించారు. పిఠాపురం కార్తికేయ ఆసుపత్రి వైద్యులు మొగలి కాశీవిశ్వనాథం, కొమ్మూరి గోవిందుబాబు, కర్రి దివ్య, యు.ఆదినారాయణ 400 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్ట్ అందిస్తున్న సేవలను మురళీరాజు అభినందించారు. అనంతరం మురళీకృష్ణంరాజుకు నిర్వాహకులు జ్ఞాపికను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బెంతుకుర్తి సుశీల అబ్బాయి, నానిపల్లి చంటి, బొల్లు సీతారామరాజు, కిల్లాడి బాబ్జి, రాయుడు దొరబాబు, కోలా తాతబాబు, మాజీ వైస్ సర్పంచ్ సత్యనారాయణ, బొల్లు రాజుబాబు, మచ్చర్ల దాసు, యాళ్ల లక్ష్మీకాంతం ఏసు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం రాజీనామా చేయాలి

- వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాన్ వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ

జగ్గంపేట: శ్రీకాళహస్తిలో జనసేన ఇన్‌చార్జి కోట వినూత దంపతులు ఓ చిరుద్యోగిని కిరాతకంగా చంపడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, దీనికి రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. జగ్గంపేటలోని తన స్వగృహంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కోట వినూత దంపతులు తమ కారు డ్రైవర్‌ను కిరాతకంగా చంపి కెనాల్‌లో పడేసిన సంఘటనను పరిశీలిస్తే కనీసం మానవత్వం ఏమాత్రం కనిపించటం లేదన్నారు. కూటమి నేతల తీరు చూస్తుంటే రాష్ట్రంలో ఉన్నది ప్రభుత్వమా లేక రాక్షస రాజ్యమా అన్న అనుమానం కలుగుతోందని విమర్శించారు.

కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హారికపై దాడి దారుణం

కృష్ణా జిల్లా బీసీ మహిళ, ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పలి హారికపై దాడిని ఆయన ఖండించారు. కూటమి అనుకూల మూకలు హారిక కారును ఆపి చేసిన దౌర్జన్యాన్ని చూస్తే మనం భారతదేశంలో ఉన్నామా ? వేరే దేశంలో ఉన్నామా ? అనే అనుమానం కలుగుతోందన్నారు. కూటమి నేతలు నిరంకుశ పోకడలు చూస్తే రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. హారికకు ప్రాణహాని ఉందని, తక్షణమే ఆమెకు గన్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఉయ్యూరి నాని, పార్టీ నేతలు విజయసారథి, వై.చార్లెస్, టి.గౌతమ్ పాల్గొన్నారు